క్లుప్తంగా

శ్రీ విశ్వవిరాట్ సంక్షేమ సంఘం నూతన కార్యవర్గం



పొన్నూరు: నిడుబ్రోలులోని విశ్వబ్రాహ్మణ కాలనీలో శ్రీ విశ్వవిరాట్ సంక్షేమ సంఘం సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు అంశాలపై చర్చించారు. అనంతరం సంఘ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. సంఘ నూతన అధ్యక్షుడిగా కంచర్ల భాస్కర ప్రసాద్, ఉపాధ్యక్షుడిగా చింతాడ రమేష్, కార్యదర్శి కాకుమాను శివ రామశర్మ, సంయుక్త కార్యదర్శి ధరణికోట శేషసాయి, కోశాధికారి మారోజు జగదీస్, ఉపకోశాధికారి కానూరి సురేష్‌బాబు ఎన్నికయ్యారు.

భక్తిశ్రద్ధలతో సెమీక్రిస్మస్ వేడుకలు



చేబ్రోలు: ఏసుక్రీస్తు చూపిన మార్గం అనుసరణీయమని వైఎస్సార్ సీపీ పొన్నూరు నియోజకవర్గ సమన్వయకర్త అంబటి మురళీ కృష్ణ అన్నారు. మండల కేంద్రమైన చేబ్రోలులోని చీలిపాలెంలో ఆదివారం రాత్రి సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సెమీక్రిస్మస్ వేడుకలు సందర్భంగా కేక్ కట్ చేశారు. అంబటి మురళీకృష్ణ మాట్లాడుతూ ఏసుక్రీస్తు చూపిన శాంతి మార్గాన్ని మానవాళి అనుసరించాలన్నారు. కుల, మతాలాలకు అతీతంగా అందరూ జరుపుకునే క్రిస్మస్ వేడుకల్లో దేవుని ఆశీస్సులు పొందాలని ఆకాంక్షించారు. ఇతరుల పట్ల ప్రేమ, దయ, కరుణ చూపాలన్నారు. చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

ప్రతి కార్యకర్తకూ అండగా ఉంటా..

పెదకాకాని: ప్రతి కార్యకర్తకూ అండగా ఉంటానని వైఎస్సార్ సీపీ పొన్నూరు నియోజకవర్గ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ పేర్కొన్నారు. ఇటీవల జైలు నుంచి బెయిల్‌పై విడుదలైన పెదకాకాని గ్రామానికి చెందిన సోషల్ మీడియా కార్యకర్త షేక్ గోపిలాల్ ఆదివారం తన విడుదలకు సహకరించిన అంబటి మురళీకృష్ణను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా అంబటి మురళీకృష్ణ మాట్లాడుతూ నవంబరు 21వ తేదీన శివాలయం నుంచి వస్తున్న గోపిలాల్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారన్నారు. నాలుగు రోజుల తరువాత పలు రకాల సెక్షన్‌లు ఆపాదించి కోర్టుకు హాజరుపరచడంతో 5 రోజులు బాపట్ల జైలులో గడపాల్సి వచ్చిందన్నారు. జైలు నుంచి బయటకు వచ్చిన వెంటనే పీటీ వారెంట్ పేరుతో మళ్ళీ అదుపులోకి తీసుకుని గుంటూరు జైలుకు పంపించారన్నారు. 15 రోజుల తరువాత గోపిలాల్ ఇంటికి రావడం జరిగిందన్నారు. కూటమి ప్రభుత్వం సోషల్ మీడియా కార్యకర్తల పేరుతో అక్రమ కేసులు పెట్టి కక్షపూరితంగా వ్యవహరిస్తుందన్నారు. ప్రతి కార్యకర్తకు అండగా ఉంటానన్నారు.

నేడు డయల్ యువర్ కమిషనర్

నెహ్రూనగర్: నగర ప్రజల స్థానిక సమస్యల పరిష్కారానికి సోమవారం డయల్ యువర్ కమిషనర్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 9.30 నుంచి 10.30 గంటల వరకు నగరపాలక సంస్థ కమిషనర్ చాంబర్‌లో 0863-2224202 నంబర్‌కు ఫిర్యాదు చేయవచ్చని చెప్పారు. అనంతరం ప్రజల నుంచి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్)ను కౌన్సిల్ హాల్‌లో మధ్యాహ్నం ఒంటి గంట వరకు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

జాతీయ చిత్రలేఖనం పోటీల బ్రోచర్ ఆవిష్కరణ



గుంటూరు ఎడ్యుకేషన్: బృందావన్ గార్డెన్స్‌లోని క్రియేటివ్ ఫైన్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న 19వ జాతీయ చిత్రలేఖనం పోటీలు, ప్రదర్శన సమాచార పత్రాలను కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ ఆవిష్కరించారు. ఆదివారం గార్డెన్స్‌లోని తన కార్యాలయంలో బ్రోచర్ ఆవిష్కరించిన పెమ్మసాని చంద్రశేఖర్ మాట్లాడుతూ ఫిబ్రవరి 16న గుంటూరు నగరంలో జరగనున్న జాతీయస్థాయి చిత్రలేఖనం పోటీలు, ప్రదర్శన ద్వారా విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మక, చిత్రకళ నైపుణ్యాలు వెలుగులోకి వస్తాయన్నారు. అకాడమీ చైర్మన్ డాక్టర్ కేవీ బాబు మాట్లాడుతూ పోటీల్లో పాల్గొనదలచిన వారు జనవరి 15లోగా తమ ఎంట్రీలను పంపాలని, వివరాలకు 98853 77653 నంబర్లో సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో వి.సోమయ్య, జిలానీ, కృష్ణ సుబ్బారావు, మధు, పీవీ రమేష్ పాల్గొన్నారు.

అమరజీవి పొట్టి శ్రీరాములు చిరస్మరణీయుడు

పొన్నూరు: అమరజీవి పొట్టి శ్రీరాములు చిరస్మరణీయులని, ఆంధ్ర రాష్ట్ర ఏర్పాటు కోసం ఆమరణ నిరాహార దీక్ష చేసి ప్రాణాలర్పించిన ఆయన త్యాగం తెలుగువారు మరువలేనిదని వైఎస్సార్ సీపీ పొన్నూరు సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ అన్నారు. ఆదివారం పొట్టి శ్రీరాములు వర్ధంతి కార్యక్రమాన్ని పొన్నూరు నియోజకవర్గంలో నిర్వహించారు. పట్టణంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో పొట్టి శ్రీరాములు చిత్రపటానికి అంబటి మురళీకృష్ణ, ఎంపీపీ భవనం పద్మలీల, నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. మురళీకృష్ణ మాట్లాడుతూ తెలుగు వారి ఆత్మ గౌరవానికి ప్రతీక పొట్టి శ్రీరాములని అన్నారు. నేటి యువత ఆయన ఆశయాలను ఆదర్శంగా తీసుకుని ముందుకుసాగాలని అన్నారు. కార్యక్రమంలో నాయకులు అంబటి వెంకటేశ్వరరావు, ఎండేటి వెంకట సుబ్బయ్య, గేరా సంజీవ్, రామ్మోహన్, తదితరులు పాల్గొన్నారు.



పొన్నూరు వైఎస్సార్ సీపీ కార్యాలయంలో పొట్టి శ్రీరాములు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మురళీకృష్ణ

పొట్టి శ్రీరాములు త్యాగం మరువలేనిది

ప్రత్తిపాడు: పొట్టి శ్రీరాములు ఆంధ్ర రాష్ట్రం కోసం చేసిన త్యాగాలు మరువలేనివని మండల విద్యాశాఖాధికారి సీహెచ్ రమాదేవి అన్నారు. అమరజీవి పొట్టి శ్రీరాములు వర్ధంతిని పురస్కరించుకుని స్థానిక మండల విద్యావనరుల కార్యాలయంలో ఆదివారం ఎంఈఓలు సీహెచ్ రమాదేవి, జి.లీలారాణి, శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సీఆర్పీలు, సిబ్బంది పాల్గొన్నారు. స్థానిక పంచాయతీ కార్యాలయంలో పంచాయతీ సెక్రటరీ ఖాజా ఆధ్వర్యంలో పొట్టి శ్రీరాములు వర్ధంతి కార్యక్రమం జరిగింది. వార్డు సభ్యులు డబ్బూరి వెంకటేశ్వర్లు, కాకాని సురేష్‌తో పాటు ఆర్యవైశ్య సంఘ నాయకులు మట్టా వెంకటేశ్వర్లు, బందం వెంకట్రావు, శ్రీనివాసరావు, పొట్టి సుబ్బారావులు శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తొలుత కార్యాలయ ఆవరణలో ఉన్న మహాత్మాగాంధీ విగ్రహానికి పూలమాలలు వేశారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ జి.రవి కుమార్ పాల్గొన్నారు.

గ్రంథాలయంలో..

పెదకాకాని: మహనీయుల అడుగుజాడల్లో ప్రతి ఒక్కరూ నడుచుకోవాలని గ్రంథాలయాధికారి వేముల విజయ్‌కుమార్ అన్నారు. పెదకాకాని లూథర్‌గిరికాలనీలోని గ్రంథాలయంలో ఆదివారం అమరజీవి పొట్టి శ్రీరాములు, సర్దార్ వల్లబాయ్ పటేల్ వర్ధంతి నిర్వహించారు. తొలుత వారి చిత్ర పటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో స్థానికులు సంగుల సంగీతరావు, లింగంగుంట కిషోర్, పాటిబండ్ల మంత్రయ్య, సంకకూరి పండు పాల్గొన్నారు. విద్యార్థులకు వ్యాసరచన, కబడ్డీ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు.

పొట్టి శ్రీరాములు చిరస్మరణీయుడు

పెదనందిపాడు(కాకుమాను): ఆంధ్ర రాష్ట్ర సాధన కొరకు ఆమరణ నిరాహార దీక్ష చేసి ప్రాణాలర్పించిన అమరజీవి పొట్టి శ్రీరాములు జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలని ఎస్టీయూ రాష్ట్ర కౌన్సిలర్ గేరా మోహనరావు అన్నారు. పెదనందిపాడు శాఖా గ్రంథాలయంలో ఆదివారం పొట్టి శ్రీరాములు వర్ధంతి నిర్వహించారు. తొలుత శ్రీరాములు చిత్రపటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి పి.సుభాషిణి, విశ్రాంత ఉపాధ్యాయులు గారపాటి రమేష్, గుగ్గిలం సాయిబాబు, వెలినేని శివయ్య, గేరా రామస్వామి, కొలగాని వీరయ్య, ఆనందరావు, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



పెదనందిపాడులో పొట్టి శ్రీరాములు చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం



ఎంపీడీఓ కార్యాలయంలో పొట్టి శ్రీరాములు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న అధికారులు



ఏటుకూరు పార్టీ కార్యాలయంలో నివాళులర్పిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

ఆర్యవైశ్య కళ్యాణ మండపం వద్ద.. స్థానిక ఆర్యవైశ్య కళ్యాణ మండపం వద్ద ఉన్న మహాత్మ గాంధీ, పొట్టి శ్రీరాములు విగ్రహాలకు పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో అరవపల్లి కృష్ణ మూర్తి, దాసరి శేషగిరిరావు, ముద్దన రాఘవయ్య, దాసరి సత్యానారాయణ, కొత్త శ్రీనివాస్ గుప్తా పాల్గొన్నారు.

ఎంపీడీఓ కార్యాలయంలో...

గుంటూరు రూరల్: నగరంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఆదివారం అమరజీవి పొట్టి శ్రీరాములు ఆత్మార్పణ దినం సందర్భంగా ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ బండి శ్రీనివాసరావు మాట్లాడుతూ ఆయన త్యాగం తెలుగు ప్రజలు మరువలేనిదని చెప్పారు. కార్యక్రమంలో ఈఓపీఆర్ ఆర్డీ కె.శ్రీనివాసరావు, ఏఓ విద్యాసాగర్ రెడ్డి పాల్గొన్నారు

వైఎస్సార్ సీపీ కార్యాలయంలో..

గుంటూరు రూరల్: మండలంలోని ఏటుకూరు బైపాస్ రోడ్డులోని వైఎస్సార్ సీపీ ప్రత్తిపాడు నియోజకవర్గ కార్యాలయంలో అమరజీవి పొట్టి శ్రీరాములు వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి, ఘన నివాళులర్పించారు.

ఎన్జీరంగా వర్సిటీలో పొట్టి శ్రీరాములు వర్ధంతి..

గుంటూరు రూరల్: నగర శివారుల్లోని లాం ఫాం వ్యవసాయ పరిశోధన స్థానంలో ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయంలో ఆదివారం అమరజీవి పొట్టి శ్రీరాములు వర్ధంతి నిర్వహించారు. తొలుత ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ డాక్టర్ జి.రామచంద్రరావు, పరిశోధన సంచాలకులు డాక్టర్ పి.వి.సత్యనారాయణ పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పులమల వేసి నివాళులర్పించి మాట్లాడుతూ పదిమంది కోసం అసువులు బాసిన ఇటువంటి మహానుభావుల త్యాగాలను గుర్తుచేసుకోవడం అవసరమన్నారు. ఈ రోజుని ఆత్మార్పణ దినంగా గుర్తించారని తెలిపారు. అమరజీవి శ్రీ పొట్టి శ్రీరాములు ధన్యజీవి, చిరస్మరణీయులు, వీరి త్యాగము మరెందరికో స్ఫూర్తిదాయకం అని కొనియాడుతూ పొట్టిశ్రీరాములు అమర్ రహే అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో డీన్ ఆఫ్ పీజీ స్టడీస్ డాక్టర్ ఏవీ రమణ, డీన్ ఆఫ్ కమ్యూనిటీ సైన్సు డాక్టర్ బి.శ్రీలక్ష్మి, డైరెక్టర్ ఆఫ్ సీడ్స్ డాక్టర్ వై.సతీష్ బోధన పాల్గొన్నారు.



మండల విద్యావనరుల కార్యాలయంలో పొట్టి శ్రీరాములు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎంఈఓలు



ప్రత్తిపాడులో చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న వార్డు సభ్యులు, ఆర్యవైశ్య సంఘ నాయకులు



పెదకాకాని గ్రంథాలయంలో నివాళులర్పిస్తున్న దృశ్యం



లాంఫాంలో పొట్టి శ్రీరాములు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న విశ్వవిద్యాలయం అధికారులు

నేటి నుంచి ధనుర్మాస మహోత్సవాలు

ఆలయ కార్యనిర్వహణాధికారి శిరీష

ప్రత్తిపాడు: నియోజకవర్గ కేంద్రం ప్రత్తిపాడులోని వేణుగోపాలస్వామి, సీతారామస్వామి వార్ల దేవస్థానంలో దేవదాయ ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో శ్రీ వేణుగోపాల స్వామి భక్త బృందం సహకారంతో సోమవారం నుంచి జనవరి 13వ తేదీ వరకు ధనుర్మాస మహోత్సవాలను నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి ఎస్.శిరీష తెలిపారు. జనవరి 10వ తేదీన శ్రీ వైకుంఠ ఏకాదశి(ముక్కోటి) ఉత్తర ద్వార దర్శనం, 11న కుడార్తై ఉత్సవం, 13న భోగి పండుగ, 14న మకర సంక్రాంతి, 15న కనుమ పండుగలను ఆలయంలో ఘనంగా శాస్త్రోక్తంగా జరపనున్నట్లు పేర్కొన్నారు. అదేవిధంగా సోమవారం నుంచి ధనుర్మాసం ముగిసే వరకు ప్రతి రోజూ తెల్లవారుజామున తిరవారాధన, తిరుప్పావై సేవా కాలం, నివేదన కార్యక్రమాలు ఆలయ అర్చకులు వైభవోపేతంగా నిర్వహించనున్నట్లు శిరీష వివరించారు. నేటి నుండి ధనుర్మాస ఉత్సవాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో ఆలయాన్ని విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు. ప్రధాన గోపురం విద్యుత్ దీప కాంతులతో ధగధగలాడుతుంది.



విద్యుత్ కాంతుల్లో వేణుగోపాలస్వామి ఆలయం

చలపతిలో బీ ఫార్మసీ, ఫార్మాడీ తరగతులు ప్రారంభం

గుంటూరు రూరల్: నగర శివారుల్లోని లాంలో చలపతి ఫార్మసీ కళాశాలలో ఆదివారం బీ ఫార్మసీ, ఫార్మాడీ కోర్సులు ఆదివారం ప్రారంభించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కొల్లిజిఎట్ ఎడ్యుకేషన్ అకడమిక్ ఆఫీసర్ డాక్టర్ సిహెచ్.తులసి పాల్గొన్నారు. ఆమె మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ఆరోగ్యం, ఫిట్నెస్, మైండ్ మ్యాపింగ్, కెరీర్, ఆధ్యాత్మికత, సర్కిల్, స్పేస్, మై హోమ్ అను అంశాలపై దృష్టి సారించి క్రమ పద్ధతిలో అనుసరిస్తే ఉన్నత స్థాయిని అందుకునేందుకు తోడ్పడుతుందని చెప్పారు. జీవితంలోని ప్రతి దశలోనూ అభిరుచులను శక్తిసామర్థ్యాలను బేరీజు చేసుకొని లక్ష్యాలను ఏర్పరచుకోవాలని పేర్కొన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను తరచూ పర్యవేక్షించాలని చెడు వ్యసనాలకు బానిసలు కాకుండా చూసుకోవాలని, టెక్నాలజీతో పోటీ పడుతూ మొబైల్, ల్యాప్‌ట్యాప్ వంటి పరికరాలు అవసరం మేరకే వినియోగించాలని చెప్పారు. ముఖ్యంగా ప్రతి ఒక్కరూ ప్రతిరోజు కనీసం పది నిమిషాలు ధ్యానం చేయాలని కోరారు. ప్రభుత్వ మహిళా కళాశాల విశ్రాంత ఇంగ్లిష్ ప్రొఫెసర్ డాక్టర్ బి.వరలక్ష్మి మాట్లాడుతూ ప్రతి విద్యార్థికి సహకారం, కమ్యూనికేషన్, కోఆర్డినేషన్, కంప్యూటర్ నైపుణ్యాలు ముఖ్యమన్నారు. ప్రతి విద్యార్థి తమ భావోద్వేగాలను నియంత్రించుకోగలిగితే వారు ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చున్నారు. చలపతి విద్యాసంస్థల అధినేత వైవీ ఆంజనేయులు మాట్లాడుతూ ఫార్మసీ విద్యపై ఉన్న ఉజ్వల భవిష్యత్ దృష్టిలో పెట్టుకొని స్మార్ట్ క్లాస్ రూమ్‌లో స్మార్ట్ యాక్టివిటీలు, అధునాతన బోధనా పద్ధతుల ద్వారా బోధనలను నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ నాదెండ్ల రామారావు మాట్లాడుతూ 2004లో కళాశాలను స్థాపించినప్పటి నుండి ఇది 22వ బ్యాచ్ అని ఫార్మా-డికు 16వ బ్యాచ్ అని అన్నారు. ప్రస్తుతం ఫార్మా రంగంలో అద్భుతమైన అవకాశాలు ఎన్నో ఉన్నాయని అమెరికా జపాన్ తదితర దేశాలు ఇండియాలో ఫార్మ పరిశ్రమల స్థాపనకు మొగ్గు చూపుతున్నాయని ప్రస్తుతం 10 వేలకు పైగా ఫార్మా నిపుణుల ఆవశ్యకత ఉందన్నారు. కార్యక్రమంలో గుంటూరు జీసీఎస్ఎస్ జూనియర్ కళాశాల ప్రధానోపాధ్యాయురాలు ఏవీ రమాదేవి తదితరులను కళాశాల అధినేత తదితరులు ఘనంగా సన్మానించారు.



అతిథులను సన్మానిస్తున్న కళాశాల యాజమాన్యం

నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు చేస్తే చర్యలు

నగరపాలక సంస్థ కమిషనర్ శ్రీనివాసులు

గుంటూరు రూరల్: నూతనంగా నిర్మాణం చేసే బహుళ అంతస్తు భవనాలు రోడ్ల మీదకు ర్యాంప్‌లు, డ్రెయిన్లపై నిర్మాణాలు చేయకుండా, డ్రెయినేజీ లైన్‌ని మేజర్ డ్రెయిన్‌లోకి కనెక్ట్ చేయాలని, నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణం చేసిన భవనాలకు ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ (ఓసీ) జారీ చేయబోమని గుంటూరు నగరపాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు స్పష్టం చేశారు. ఆదివారం గోరంట్ల, రెడ్డిపాలెం ప్రాంతాల్లో ఆక్యుపెన్సీ సర్టిఫికెట్‌కు దరఖాస్తు చేసుకున్న భవనాలను పరిశీలించి, సెట్ బ్యాక్, రోడ్ల కొలతలు, ర్యాంప్‌లను తనిఖీ చేశారు. కమిషనర్ మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనల మేరకు మాత్రమే నగరంలో బహుళ అంతస్తు భవనాలు నిర్మాణాలు జరగాలని, నిబంధనలు ఉల్లంఘన చేస్తే తగిన చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రణాళిక అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేస్తున్నామని చెప్పారు. భవనాలు నిర్మాణ దశలోనే వార్డు సచివాలయ ప్లానింగ్ కార్యదర్శులు నిరంతరం పరిశీలిస్తూ, నిబంధనల మేరకు నిర్మాణాలు చేపట్టకుంటే వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తెచ్చి, నోటీసులు జారీ చేయాలని ఆదేశించారు. రోడ్ల మీదకు ర్యాంప్‌లు, డ్రెయిన్ల ఆక్రమణలు లేకుండా చర్యలు తీసుకోవాలని, ఇప్పటికే నిర్మాణం చేసిన వాటిని తొలగించాలని స్పష్టం చేశారు. ప్రధానంగా సెట్ బ్యాక్ పోర్షన్‌లో ఏ విధమైన నిర్మాణాలు చేయకూడదని, జనరేటర్లు కూడా పెట్టడానికి వీలు లేదన్నారు. గ్రీనరీకి ప్లాన్‌లో చూపిన విధంగా ఉండాలన్నారు. వాచ్ మెన్ రూమ్ నగరపాలక సంస్థ నుంచి అనుమతి పొందిన ప్లాన్ ప్రకారమే ఏర్పాటు చేసుకోవాలన్నారు. అపార్ట్‌మెంట్ నిర్వాహకులే డ్రెయినేజీ లైన్‌ను మేజర్ డ్రైన్ వరకు కనెక్ట్ చేసుకోవాలని కోరారు. పర్యటనలో అసిస్టెంట్ సిటీ ప్లానర్ మల్లికార్జున, టీపీఎస్ లక్ష్మణ స్వామి పాల్గొన్నారు.



భవనాలను పరిశీలిస్తున్న కమిషనర్ శ్రీనివాసులు

ప్రభుత్వ పాఠశాల ప్రహరీ ఏర్పాటు

జిల్లా విద్యాశాఖాధికారి సి.వి. రేణుక

సాక్షి ఎఫెక్ట్

పొన్నూరు: పట్టణం 25 వార్డులోని ఇందిరానగర్ కాలనీ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేసేందుకు వెంటనే ప్రహరీ ఏర్పాటు చేసే విధంగా చర్యలు చేపడతామని జిల్లా విద్యాశాఖాధికారి సి.వి.రేణుక ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పాఠశాలకు ప్రహరీ లేని కారణంగా రక్షణ కరువైందని, పలు సమస్యలను వివరిస్తూ ప్రభుత్వ పాఠశాలకు రక్షణ కరువు శీర్షికన ఆదివారం సాక్షిలో ప్రచురితమైన కథనానికి డీఈఓ స్పందించారు. వెంటనే స్థానిక ఎంఈఓను పాఠశాలకు సందర్శించాలని ఆదేశించారు. ఎంఈఓ పాఠశాలలో సమస్యలను గుర్తించి నివేదికను జిల్లా కార్యాలయానికి పంపించారు. పాఠశాల రక్షణకు సీసీ కెమెరాలు, డాబా మెట్లకు గ్రిల్స్, ప్రహరీ ఏర్పాటుతో సమస్యను త్వరగా పరిష్కరించనున్నట్లు తెలిపారు.

సంగీత విభావరి

నగరంపాలెం: స్థానిక బృందావన్‌గార్డెన్స్ శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణం అన్నమయ్య కళావేదికపై ఆదివారం కళాంజలి(గుంటూరు) ఆధ్వర్యంలో సుమధుర సంగీత విభావరి నిర్వహించారు. గాయనీ గాయకులు ఎం.సత్యవర్ధన్, టి.సుధీర్, ఎ.సాంబశివ రావు, టి.రమేష్, పి.గాయత్రిలు గాత్ర ధారణతో అనాటి సినీ, భక్తి గీతాలను శ్రావ్యంగా ఆలపించారు.

మామిళ్లపల్లిలో అయ్యప్పస్వామి భజన



పొన్నూరు:మండలంలోని మామిళ్లపల్లిలో ఆదివారం అయ్యప్పస్వామి భజన, అభిషేకం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా వైఎస్సార్ సీపీ పొన్నూరు సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ పాల్గొని స్వామిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా మణికంఠుడి నామస్మరణతో ప్రాంగణమంతా మార్మోగింది. అనంతరం అయ్యప్పస్వాములకు సద్ది వితరణ గావించారు.

భూసార పరీక్షలు ఆధారంగా పంటల సాగు

ప్రత్తిపాడు: భూసార పరీక్షల ఆధారంగా రైతులు పంటలను సాగు చేసుకుంటే సత్ఫలితాలుంటాయ ని వ్యవసాయ విద్యార్థినులు రైతులకు వివరించారు. బాపట్ల వ్యవసాయ కళాశాల విద్యార్థినులు గ్రామీణ వ్యవసాయ కృషి అనుభవ కార్యక్రమంలో భాగంగా వట్టిచెరుకూరులో రైతులకు భూసార పరీక్షలపై అవగాహన కల్పించారు. రైతులు తమ భూముల నుంచి శాస్త్రీయంగా మట్టిని సేకరించి సమీపంలోని వ్యవసాయ ప్రయోగశాలల్లో అందించాలని కోరారు. పరీక్షల ఆధారంగా భూమిలో పంటలకు కావాల్సిన పోషకాలు ఉన్నాయా లేదా అన్నది తెలుసుకోవచ్చని చెప్పారు. పరీక్షల ఆధారంగా పంటలను సాగు చేసుకుంటే అధిక దిగుబడులు సాధించవచ్చని వివరించారు. అధిక మోతాదులో రసాయనిక ఎరువులు వినియోగించడం వలన భూసారం తగ్గి, పెట్టుబడుల భారం అధికమవుతుందని తెలిపారు. అనంతరం పొలంలో మట్టి సేకరించే విధానాన్ని ప్రయోగాత్మకంగా రైతులకు తెలియజేశారు. కార్యక్రమంలో వ్యవసాయ విద్యార్థినులు గాయత్రి, ముస్కాన్ కుమారి, హ్యాపి సహజ, గీతాభవాని, సాహితి, బృంద, అభినయశ్రీ పాల్గొన్నారు.



భూసార పరీక్షలపై రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ కళాశాల విద్యార్థినులు

పన్నుల శాఖలో వసూళ్ల పర్వం

- సీటీటీ తనిఖీల్లో కిందిస్థాయి సిబ్బంది కీలక పాత్ర
- వాహన తనిఖీల్లో చిక్కిన వాహనాలతో బేరసారాలు
- పట్టించుకోని ఉన్నతాధికారులు

పొన్నూరు: రాష్ట్ర పన్నుల శాఖలో పొన్నూరు కేంద్రంగా సాగుతున్న వసూళ్ల పర్వంపై ఉన్నతాధికారులు సీరియస్ అయ్యారు. జీఎస్టీ ముసుగులో వ్యాపారుల నుంచి అక్రమ వసూళ్లకు పాల్పడుతున్న కొందరు క్రిందిస్థాయి సిబ్బందిని మందలించినట్లు కార్యాలయ వర్గాల నుంచి అందిన సమాచారం. గత నవంబర్ 29న పట్నంబజార్ సర్కిల్ పరిధిలోని పొన్నూరులో కొన్ని వ్యాపార సంస్థలు అధిక లావాదేవీలు చేస్తూ జీఎస్టీ ఎగవేస్తున్నారని, దీనికి కొందరు ఉద్యోగుల సహకారాన్ని తెలియజేస్తూ పొన్నూరులో యథేచ్ఛగా జీరో దందా శీర్షికన సాక్షిలో కథనం ప్రచురితమైంది. దీంతో అక్రమంగా వసూళ్లకు పాల్పడుతున్న ఉద్యోగులు స్థానిక వ్యాపారులను భయాందోళనకు గురి చేసినట్లు తెలిసింది. ఉన్నతాధికారులు విచారణకు వస్తే వసూళ్ల నిర్వాకంపై నోరు మెదపకూడదని, లేని పక్షంలో అందరినీ జీఎస్టీ రెగ్యులర్ డీలర్లుగా నమోదు చేయాల్సి వస్తుందని సిబ్బంది హెచ్చరించినట్లు ఒక వ్యాపారి ఆవేదన వ్యక్తం చేశారు. ఉన్నతాధికారులు స్పందించి వెంటనే సర్కిల్ పరిధిలోని విభాగాల అధికారులను మందలించినట్లు సమాచారం.



పొన్నూరులో తనిఖీ చేసిన కూల్‌డ్రింక్స్ వాహనం

- సర్కిల్ పరిధిలో కొందరు కిందిస్థాయి సిబ్బంది పనితీరు విమర్శలకు తావిస్తోంది. ఆధార్ సీడింగ్ పేరుతో కార్యాలయం నుంచి ఫోన్లు చేస్తూ వ్యాపారులను వేధిస్తున్నట్లు తెలిసింది. అందివచ్చిన ప్రతి అవకాశాన్ని సిబ్బంది వారి వసూలుకు అనుకూలంగా మలుచుకుంటున్నారు. సీటీటీ తనిఖీల్లో భాగంగా అధికారులు కిందిస్థాయి సిబ్బందిని, వాహన డ్రైవర్లను నియమించుకుంటారు. ఇదంతా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకే జరగాలి. కానీ కొంతమంది సిబ్బంది ఎలాంటి ఆదేశాలు లేకుండానే తనిఖీలకు వెళుతున్నారు. తనిఖీల సమయంలో కొన్నిచోట్ల వాహనాల్లో లోపాలను గుర్తించిన సిబ్బంది వెంటనే బేరసారాలు మొదలు పడుతున్నారు. ఈ లావాదేవీల్లో గుమస్తాలు, అటెండర్లు, డ్రైవర్లు, కీలకంగా వ్యవహరిస్తున్నారని ఆరోపణలున్నాయి.

22న సలాం నమస్తే ఫైనల్స్ పోటీలు

గుంటూరు మెడికల్: ప్రతి ఒక్కరిలో ఏదో ఒక ప్రతిభ దాగి ఉంటుందని, వారిలో అంతర్లీనంగా దాగి ఉండే ప్రతిభను వెలికితీసేందుకు తాము పలు అంశాలపై పోటీలు నిర్వహిస్తున్నామని సలాం నమస్తే గుంటూరు సొసైటీ ఫౌండర్ డాక్టర్ షేక్ షమా సుల్తానా అన్నారు. సలాం నమస్తే సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం గుంటూరు పొన్నూరు రోడ్డులోని ఎస్ కన్వెన్షన్ హాల్లో గుంటూరు ఘాట్ టాలెంట్ షో పోటీలు నిర్వహించారు. పాటలు, డాన్స్, స్టాండ్ అప్ కామెడీ, మ్యాజిక్ షో, మ్యూజికల్ ఇనుస్ట్రుమెంట్స్, ఫ్యాషన్ షో, మెహందీ, పోఎట్రీ, ఫన్నీ ఆర్ మెసేజ్ ఓరియంటెడ్ స్కిట్ పోటీలను నిర్వహించారు. పోటీలకు ముఖ్య అతిథిగా డాక్టర్ సలాం విచ్చేసి సెమీ ఫైనల్స్ విజేతలను అభినందించారు. సలాం నమస్తే గుంటూరు సొసైటీ ఫౌండర్ డాక్టర్ షమా సుల్తానా మీడియాతో మాట్లాడుతూ గుంటూరు గాట్ టాలెంట్ షో ఆదివారంతో సెమీఫైనల్స్‌ను పూర్తి చేశామని తెలిపారు. ఈనెల 22న గుంటూరు పొన్నూరు రోడ్డులోని ఎస్ కన్వెన్షన్ హాల్‌లో ఫైనల్స్ పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఫైనల్స్ విజేతలకు ఈ నెల 26న గుంటూరు వెంకటేశ్వర విజ్ఞాన్ మందిరంలో బహుమతులు అందజేయనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో షేక్ కరీం, మేనేజర్ నాగేశ్వరావు, కోవిడ్ ఫైటర్స్ అల్లాబక్షు నూర్ ఖాన్ పాల్గొన్నారు.